సీరియల్

అగ్ని సంస్కారం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

హెలికాప్టర్ వేగంలో వున్నట్టుండి మార్పువచ్చింది. వేగం తగ్గిపోయింది. పైలట్ తోపాటుగా ఆ విషయాన్ని ముందుగా ప్రొఫెసర్ అనంత్ గమనించాడు.

"ఏమిటి? ఏమయ్యింది?" అడిగాడు భారత్ పైలట్ ని.

పైలట్ వెంటనే మాట్లాడలేదు. సీరియస్ గా యెదురుగా వున్న మీటలకేసి చూస్తున్నాడు.

వేగం తగ్గటమే కాకుండా హెలికాప్టర్ చిన్నగా కిందికి దిగిపోవటం మొదలుపెట్టింది.

ఉలిక్కిపడ్డాడు భారత్ — అతడితోపాటు మిగిలిన వాళ్ళందరికీ కంగారు పుట్టుకొచ్చింది.

"ఏం జరిగింది?" ప్రొఫెసర్ అనంత్ అడిగాడు.

"చూస్తున్నాను. ఏదో చిన్న సాంకేతిక లోపమై

వుంటుంది" అన్నాడు పైలట్ చూస్తూ.

లీల భయంగా అనంత్ కళ్ళల్లోకి చూసింది.

"ఆశ్చర్యంగా వుంది. బయల్దేరబోయే ముందు నువ్వు చెక్ చేసుకోలేదా?" అడిగాడు భారత్.

"చేశాను. అంతా బాగానే వుంది. కాని ఇంతలోనే ఏం జరిగిందో అర్థం కావటంలేదు."

వాళ్ళు మాట్లాడుతున్నప్పుడే వేగం మరింతగా తగ్గిపోయింది. కిందికి దిగబోతున్న హెలికాప్టర్‌ని తిరిగి ఎత్తుకు లేపాడు పైలట్.

అతడికీ ఆశ్చర్యంగా వుంది. ఇంతలోనే ఏమయ్యింది?

"హెలికాప్టర్ కనీసం సాబూజా దీవిని కూడా చేరక ముందే ఇలా జరగటం విచారకరం. ఇప్పుడు మన కేమిటి దారి? మనం బయల్దేరిన టైము బాగాలేదు" అన్నాడు ప్రొఫెసర్ అనంత్.

"అవును. మనం బయల్దేరకుండా వుంటే బావుండేది. ఇలా జరుగుతుందనుకోలేదు" అన్నది లీల నిష్ఠూరంగా.

భారత్‌కి బాధ కలిగింది వాళ్ళలా మాట్లాడుతుంటే. పైలాను చూశాడు. ఆమె నిశ్చలంగా కిందికి చూస్తోంది.

ముందుకు చూస్తున్నదల్లా లీల హుషారుగా అన్నది "అదిగో చూడండి....కొంచెం దూరంలో చెట్లు—భూమి కనిపిస్తోంది. మనం సాబూజా దీవికి దగ్గర్లోకి వచ్చేశాం"

అంతా ముందుకు చూశారు.

నిజమే. కొంచెం దూరంలోనే దట్టంగా యెదిగిన చెట్లతో అంతా పచ్చగా కనపడుతోంది.

ప్రొఫెసర్ చిన్నగా ఇలా అన్నాడు—

"ఇక్కడినించే దీవులు మొదలవుతాయి. ఈ దీవి సాబూజా దీవి కాదు. వీటిని నికోలాయ్ దీవులు

అంటారు. ఈ దీవుల్లో మానవసంచారం అసలు వుండదు. ఈ దీవుల్లో అన్నీ క్రూరమృగాలు, భయంకరమైన విష కీటకాలు వుంటాయి. ఈ దీవులు ప్రతి అంగుళం ప్రమాదంతో నిండివుంటాయి."

ఆ మాటలు వినగానే అందరినీ నిరుత్సాహం ఆవహించింది.

హెలికాప్టర్ చాలావరకు వేగం తగ్గిపోయింది.

అప్పటివరకూ ఇంజన్‌లో వున్న లోపాన్ని కనుక్కోటానికి ప్రయత్నించిన పైలట్ విచారవదనంతో ఇలా అన్నాడు—

"క్షమించండి....లోపమేమిటో తెలీటంలేదు. రన్నింగ్‌లో లోపాన్ని తెలుసుకోవటం సాధ్యం కావటంలేదు. అయినా ఇంకో పదినిముషాలకంటే హెలికాప్టర్ ఎగరలేదనే అనుకుంటున్నాను. అందువల్ల మనం వెంటనే దిగిపోక తప్పదు. లేకపోతే సముద్రంలో పడిపోక తప్పదు."

భయంతో బిగుసుకుపోయారు.

భారత్‌కు గుండె ఆగిపోయినట్లనిపించింది.

నికోలాయ్ దీవులు మొదలవుతున్నాయ్....సముద్ర తీరం దగ్గరపడుతోంది.

పైలట్ మీద భరించలేని కోపం వచ్చింది. కాని అతను మాత్రం యేంచెయ్యగలడు? సడన్‌గా ఏదో జరిగింది. ఐనా ఇప్పుడు పైలట్‌ను నిందిస్తూ కూర్చున్నందువల్ల ప్రయోజనం లేదు. ఏదో ఒక నిర్ణయం వెంటనే తీసుకోవాలి.

"ఏం చేద్దాం?" అనంత్‌ను అడిగాడు.

"చెయ్యగలిగింది యేమీ లేదు. ప్రమాదకరమైన ఈ కోలాయ్ దీవుల్లో హెలికాప్టర్‌ను దించకతప్పదు. అను

పైన స్థలం చూసుకుని దిగిపోవాలి" అన్నాడు.

అప్పటికి నికోలాయ్ దీవులమీదికి చేరుకుంది హెలికాప్టర్.

అప్పటికే సూర్యుడు దిగిపోయాడు.

చీకటి పడుతోంది.

దీవిమీద యెగురుతోంది హెలికాప్టర్ చాలాతక్కువ యెత్తులో. కొంచెం దూరం వచ్చేసరికి చుట్టూ చెట్లు—మధ్యలో కొంత మేర మైదానంలా వున్న ప్రదేశం కనపడింది.

"ఇక్కడ దించుతాను" అన్నాడు పైలట్.

"దించెయ్యి" అన్నాడు అనంత్.

అప్పటికే హెలికాప్టర్ దిగిపోవటం మొదలుపెట్టింది.

•   •   •

చుట్టూ దట్టంగా పెరిగిన చెట్లు. పైన ఆకాశం కనపడుతోంది. చెట్లమీద పక్షుల అరుపులు గోలగా వినపడుతున్నాయి.

హెలికాప్టర్ ఆ దీవిలోకి దిగటంతోనే అందరి గుండెలూ భయంతోనే చిన్నగా అదిరాయి. ఎందుకంటే ఆ దీవులగురించి ప్రొఫెసర్ అనంత్ చెప్పిన మాటలు వాళ్ళు మరచిపోలేరు.

చీకటి నీడలు ఆ దీవిమీద పరచుకున్నాయి. వెలుగు పూర్తిగా అంతరించిపోతోంది.

సముద్రం దగ్గరలోనే వుండటంవల్ల దాని హోరు భీకరంగా వినిపిస్తోంది.

గాలి రివ్వున వీస్తోంది.

హెలికాప్టర్‌లోనించి కిందికి దిగటానికే అందరికీ భయం కలిగింది.

ముందుగా స్టెల్లా కిందికి దిగింది.

ఆమె దిగిన తర్వాత జాన్సన్ దిగాడు. దిగి ఒకసారి చుట్టూ వున్న పరిసరాలను తన పెద్ద పెద్ద కళ్ళతో చూశాడు.

చీకటి పడుతున్నా పరిసరాలు బాగానే కనిపించాయి. అక్కడి చెట్లకు నల్లటి పండ్లు వేళ్లాడుతూ ఉండటాన్ని వాళ్ళంతా గమనించారు.

అంతా దిగారు.

కింద నల్లగా వున్న గడ్డి పెరిగి ఉంది ఎత్తుగా—

పైలట్ మాత్రం లోపలే వుండిపోయాడు. టార్చి లైటుతీసి ఆ వెలుతుర్లో డిఫెక్ట్ను ఐడెంటిఫై చేస్తున్నాడు.

"డిఫెక్టు సరయితే మనం వెంటనే బయలుదేరే అవకాశం వుందా?" అడిగింది లీల—అనంత్ ను.

"లేదు. ఈ చీకట్లో దీవులను గుర్తించటం కష్టం. పగటివేళనే అది సాధ్యమవుతుంది. బాగా తెలిసివుంటే తప్ప రాత్రివేళ గుర్తించటం సాధ్యంకాదు. అందువల్ల ఈ రాత్రి మనం ఈ దీవిలో గడపక తప్పదు."

చీకటి చిక్కబడుతోంది.

మగవాళ్ళంతా సిగరెట్లు వెలిగించారు.

స్టెల్లా—లీల మాట్లాడుకుంటున్నారు.

రంజిత్ జాన్సన్ తో మాట్లాడుతున్నాడు.

పైలట్ ఇంజన్ తో కుస్తీపడుతున్నాడు.

భారత్ మాట్లాడుతున్నాడే కాని అతనికి మనసులో ఆందోళనగా వుంది. ఏమిటీ హంసపాదు? మొదట్లోనే ఇలా ఎందుకు జరిగింది?

అతని ఆలోచనలకు అంతరాయం కలిగించి.

ఉన్నట్టుండి లీల భయంతో అరిచింది సెల్లాతో మాట్లాడుతున్నదల్లా ఆగిపోయి.

చెట్లమధ్యగా ఒక వైపుకు వేలుపెట్టి చూపుతూ—

అంతా ఆ వైపుకు చూశారు.

అక్కడ కొంతదూరంలో వున్న చెట్లమధ్య కొంచెం ఎత్తుగా వున్న జంతువు నిలబడి వాళ్ళనే చూస్తోంది. అది ఏ రంగులో వుందో తెలీటంలేదు—చీకటి పడుతుండటం కారణంగా—

దాని కళ్ళు లైట్లులా మెరుస్తున్నాయి.

అంతా ఆ జంతువునే చూస్తున్నారు. అదికూడా కదలకుండా అక్కడే కూర్చుని వాళ్ళనే రెప్పవాల్చకుండా చూస్తోంది.

హఠాత్తుగా గుర్తొచ్చింది అనంత్‌కు—ఆ జంతువు ఎర్రతోడేలు. అది ఒంటరిగా వున్నప్పుడు యెక్కువ మంది మనుషులు వుంటే వాళ్ళ జోలికి రాదట. ఒంటరిగా వున్న మనిషిమీద హఠాత్తుగా దాడిచేస్తుందిట. ఎక్కువమంది మనుషులు వున్నప్పుడు మిగిలిన తోడేళ్ళను కూడా తీసుకుని దాడికి వస్తుందిట.

ఆ విషయం గుర్తుకు రాగానే అతని ఒళ్ళు జలదరించింది. అంటే అది తప్పకుండా ఏదో ఒక సమయంలో తన జాతి తోడేళ్ళన్నింటినీ తీసుకుని వస్తుంది.

భారత్ టార్చిలైటు తీశాడు.

దానిమీదకు ఫోకస్ చేశాడు.

అంతా చూశారు. ఎర్రగా వుంది. దాని శరీరం రంగు నెత్తురు పూసినట్టుగా—

చిత్రంగా అది వెలుతురు కళ్ళమీద పడుతుంటే

తలను మాత్రమే శరీరం ఏమాత్రం కదలకుండా అటూ ఇటూ కదిల్చింది.

"సందేహం లేదు. ఎర్ర తోడేలు" అన్నాడు అనంత్ పెద్దగా అందరికీ వినిపించేలా.

"ఎర్ర తోడేలా! దీని మొహం తోడేలులా లేదు కదా!" అన్నాడు రంజిత్.

"లేదు, కాని ఇది తోడేలు సంతతికి చెందిన జంతువు. దీని గుణాలన్నీ తోడేలు గుణాలే" అంటూ ఎర్ర తోడేళ్ళ గురించి వాళ్ళకు తెలియపరిచాడు.

అప్పటికే జాన్సన్ ప్యాంటు జేబులోనించి రివాల్వర్ తీసి చేతిలో పెట్టుకున్నాడు.

అతడి చర్యను పెల్లా గమనించి "తొందరపడకు" అని "జాన్సన్ దాన్ని షూట్ చెయ్యబోతున్నాడు" అన్నది.

అప్పుడంతా అతనివైపు తిరిగారు.

జాన్సన్ గురి చూసుకుంటున్నాడు.

"షూట్ చెయ్యకు. అది మన జోలికి రానప్పుడు దాన్ని కాల్చటం ఎందుకు?" అన్నాడు భారత్. అతని భయం ఏమిటంటే రివాల్వర్ పేలిన చప్పుడుకు మిగిలిన జంతువులు ఏవైనా అక్కడికి వస్తాయేమోనని.

"కాదు. ఆ ఎర్ర తోడేలు గురించి మీకు తెలీదు భారత్....అది అలా చూసి వెళ్ళి తన బలగంతో వచ్చి మనమీద దాడిచేస్తుంది. అందువల్ల దాన్ని షూట్ చెయ్యకుండా వదలకూడదు" అన్నాడు అనంత్.

అతడి మాటలు పూర్తి అవకముందే ఢామ్మని రివాల్వర్ మోతి ఆ దీవి అంతా ప్రతిధ్వనించింది.

లీల భయంగా అనంత్ దగ్గరగా జరిగింది.

అంతా ఆ ఎర్ర తోడేలు రివాల్వర్ గుండుదెబ్బ తగిలి నెత్తురు మడుగులో గిలగిలా తన్నుకుంటూ వుంటుం దని అనుకున్నారు.

కాని — జరిగింది మరొకటి.

జాన్సన్ ప్రయత్నాలను అది గమనించినట్టుగా రివాల్వర్ పేలే సమయానికి అది హఠాత్తుగా వూహించ నంత వేగంగా కాళ్ళను వంచి కింద కూలబడి పోయింది.

వాళ్ళంతా దాని తెలివితేటలకు ఆశ్చర్యపడ్డారు. అది తప్పకుండా తోడేలు జాతికి చెందిన జంతువేనని నమ్మకం అందరికీ కలిగింది.

జాన్సన్ రెండోసారి రివాల్వర్ పేల్చేంతలోనే అది వూహించనంత వేగంగా వెనక్కి తిరిగి చెట్లమధ్యనించి పరుగుదీసింది.

"మై గాడ్....ఇటీజ్ టూ డేంజరస్ .... అది ప్రాణాలతో తిరిగివెళ్ళటం ప్రమాదం" అని అరిచాడు అనంత్.

బాణంలా ముందుకు పరుగుదీశాడు జాన్సన్ రివాల్వర్ చేతపట్టుకుని — భారత్ చేతిలో నించి టార్చి లైటును లాక్కొని —

"జాన్సన్" అరిచాడు అనంత్ కంగారుగా.

ఆగిపోయాడు జాన్సన్ కొంచెం ముందుకు వెళ్ళి, అప్పటికే ఎర్ర తోడేలు కనిపించకుండా పోయింది.

చెట్లకింద రాలిన ఎండుటాకుల మీద ఎర్ర తోడేలు పరుగెడుతున్న చప్పుడు వినిపించి నిమిషంలో అది

క్రమంగా మాయమయిపోయింది.

"ఇక రాత్రంతా మనకు జాగరణ తప్పదు. దాన్ని తప్పించుకోనివ్వకుండా వుంటే బావుండేది" అన్నాడు అనంత్.

"నేను షూట్ చేసినా బావుండేది" అన్నది స్టెల్లా.

ఆ మాటలు జాన్సన్ కు వినిపించాయి. పౌరుషంగా స్టెల్లాను చూస్తూ "అంటే నీ ఉద్దేశం యేమిటి? నాకు గురిచూసి కాల్చటం రాదనుకున్నావా?" అన్నాడు బొంగురు గొంతుతో.

స్టెల్లా యేదో మాట్లాడబోతున్నప్పుడు అనంత్ కలగజేసుకుని "ఎర్ర తోడేలు విషయంలో యెంత నేర్పరిగా షూట్ చెయ్యగలిగిన వాళ్ళైనా దాన్ని పడగొట్టటం కష్టమే. దానికి వున్న తెలివితేటలు అలాంటివి. ఈ విషయం గురించి మీరు ఘర్షణకు దిగకండి" అన్నాడు.

ఐనా జాన్సన్ స్టెల్లాను గుర్రుగా చూశాడు.

పైలట్ బయట జరుగుతున్న ఈ గొడవను పట్టించుకోకుండా జరిగిన లోపం గురించి సెర్చి చెయ్యటంలో మునిగిపోయివున్నాడు.

• • •

పూర్తిగా చీకటి పడిపోయింది.

ఐనా హెలికాప్టర్ లో వెలుగుతున్న దీపాల కాంతితో అక్కడంతా వెలుతురుగా వుంది.

వాచీకేసి చూసుకున్నాడు భారత్.

ఏడుగంటలు కావస్తోంది.

జాన్సన్ చిన్నగా రంజిత్ తో యేదో మాట్లాడుతున్నాడు.

"ఇంకా డిఫెక్టు యెక్కడున్నదో తెలిసినట్టుగా లేదు. ఈ రాత్రికి ఈ రిపేర్ జరుగుతుందా?" సందేహంగా అడిగింది లీల.

"ఏమో! బయల్దేరగానే ఇలా జరగటం అంత శుభ సూచకంగా లేదు. లేకపోతే ఈ సమయానికి సాబూజా దీవి మనుషులతో టకారా దీవి గురించి మాట్లాడుతూ వుండేవాళ్ళం" అన్నాడు అనంత్ సిగరెట్టు వెలిగిస్తూ—

"అవును ఇలా జరిగినందుకు చింతిస్తున్నాను. ఇది మనం ఏమాత్రం వూహించని పరిణామం. త్వరలోనే మన వెహికల్‌కి రిపేర్ పూర్తవుతుందని రేపు ఉదయమే మనం ఈ నికోలాయ్ దీవులను వదిలి వెళతామని నేను అనుకుంటున్నాను" అన్నాడు భారత్.

అక్కడ వారికి ఏమీ తోచటం లేదు. ఒక్కనిమిషం గడవటమే ఎంతో కష్టంగా వుంది.

భారత్ లోపలకు వెళ్ళాడు.

పైలట్ దగ్గరకు వెళ్ళి పొజిషన్ గురించి అడిగాడు. అందుకతను చిన్నగా "కంగారుపడకండి. ఇది మేజర్ డిఫెక్టు అయివుంటుందని నేను అనుకోవటం లేదు. త్వరలోనే గుడ్ కండిషన్‌లోకి వస్తుంది. ఐయామ్ సారీ.... ఇలా జరుగుతుందని నేనుకూడా అనుకోలేదు. లిఫ్టు చెయ్యబోయే ముందు చెక్ చేశాను. అంతా బాగానే వుంది. అందుకే నాకు ధైర్యంగా వుంది. ఇదేదో మైనర్ డిఫెక్టు అయివుంటుంది" అన్నాడు.

"బోర్ కొడుతోంది" అన్నది లీల.

“తప్పదు. మరి దీవుల ప్రయాణం అంటే ఏమిటనుకున్నావ్? ఏదయినా మాట్లాడు” అన్నాడు అనంత్.

“ఏం మాట్లాడను? ఎంత సేపని నేనొక్కదాన్నే మాట్లాడేది? ఎవరైనా ఒక మంచి కథ చెప్పండి. టైము గడిచిపోతుంది” అన్నది లీల.

“కథలో మునిగిపోయామంటే మన పని అవుట్... ఎర్ర తోడేళ్ళ దాడి గురించి మనం గుర్తుంచుకోవాలి. అవి ఏ క్షణంలోనైనా రావొచ్చు....అందరం ఆయుధాలతో సిద్ధంగా వుండాలి.”

“మిస్టర్ అనంత్. ఈ లైట్లు వెలగటం అంత మంచిది కాదేమో!” అన్నాడు భారత్.

“అవును. నేనుకూడా అదే అనుకుంటున్నాను. ఈ వెలుతురు వల్ల దూరంగా వున్న జంతువులకు కూడా మన ఉనికి ఎంత వద్దనుకున్నా తెలిసిపోతుంది. అందుకే మనం ఈ లైట్లను ఆర్పివేయాలి” అన్నాడు అనంత్.

సరిగ్గా అప్పుడే పైలట్ సంతోషంతో అరిచాడు. “ఉయార్ లక్కీ....డిఫెక్టు దొరికింది” అన్నాడు.

అతని దగ్గరకు పరుగుదీశారు భారత్—అనంత్—రంజిత్.

“ఇక మనం భయపడవలసిన అవసరం లేదు. మైనర్ డిఫెక్టు....పని నిముషాల్లోనే అయిపోతుంది.”

అంతా తేలిగ్గా గాలి పీల్చుకున్నారు. ఒక భయం తీరింది. ఇక ఈ రాత్రి గడవటం ఎలాగో చూడాలి.

పదినిముషాల్లో పైలట్ ఇంజన్ను స్టార్టుచేశాడు. చిన్న చప్పుడుతో స్టార్టయ్యింది. ప్రొపెల్లర్లు గిర్రున తిరిగాయి. విసురుగా గాలి వీచింది.

రెండు నిముషాల తర్వాత పైలట్ ఇంజన్ని ఆఫ్ చేశాడు. బయటకు వచ్చాడు.

"క్షమించండి. మీకో గొప్ప యాంగ్జాయిటీని కలిగించాను. ఒకోక్కసారి ఇలాగే జరుగుతుంది. కాని ఇలా జరక్కుండా వున్నట్లయితే మనం దిగాలనుకున్న దీవిలోనే దిగేవాళ్ళం" అన్నాడు వాళ్ళతో నొచ్చుకుంటున్నట్టు.

"నెవర్ మైండ్ .... మేమేం అనుకోలేదు. కొంచెం భయపడిన మాట నిజమే, ఎందుకంటే హెలికాప్టర్ లేకపోతే మనం ఈ దీవిలోనే వుండిపోవలసి వచ్చేది" అన్నాడు అనంత్.

• • •

"ఎనిమిది గంటలవుతోంది" అన్నది లీల.

"అవును. మనం ఇక తిండి యేర్పాట్లు చూస్తే మంచిది" అన్నాడు భారత్.

"అంతా లోపలకు రండి" అన్నాడు భారత్.

కింద నిల్చుని చిన్నగా మాట్లాడుకుంటున్న వాళ్ళంతా లోపలకు వచ్చారు.

సెల్లా బిస్కెట్లు—బ్రెడ్ తీసి అందరికీ ఇచ్చింది. వాటిని తిని అంతా టిన్లో తీసుకొచ్చిన నీళ్ళు తాగారు.

జాన్సన్కు ఆ తిండి సరిపోలేదు. అందుకే దిక్కులు చూశాడు.

అతడి చూపులను గమనించి రంజిత్ "సారీ జాన్సన్. నీ ఆకలి సంగతి నాకు తెలుసు. ఐతే అనుకోకుండా మనం ఇక్కడ చిక్కుపడిపోవటంవల్ల ఈ బ్రెడ్, బిస్కెట్లతో కడుపు నింపుకోవలసి వచ్చింది. లేకపోతే మంచి

మాంసాన్ని తినగలిగి వుండేవాళ్ళం" అన్నాడు.

అనంత్ ను చూశాడు తర్వాత.

"అవును మిస్టర్ జాన్సన్. సాబూజా దీవిలో మనం దిగగలిగి వున్నట్లయితే మనం జీవితంలో మరచిపోలేని ఆతిథ్యం మనకు వారికి వుండేది. ఆ దీవి వాసుల గురించి నాకు బాగా తెలుసు. మంచి రుచికరమైన మాంసాన్ని మనకు వండిపెడతారు. వాళ్ళు పాములను చంపి చేసే వంటకాలు అద్భుతంగా వుంటాయి. అటువంటి రుచికరమైన మాంసాన్ని ఎప్పుడూ తిని వుండము. సాబూజా దీవిలో వారికే పాములు అంత రుచిగా వుంటాయి. ఈ రాత్రికి యెలాగో ఓపిక పట్టు. రేపు మనం మంచి భోజనాన్ని చెయ్యొచ్చు" అన్నాడు అనంత్.

జాన్సన్ మాట్లాడలేదు.

మౌనంగా జేబులోనించి సిగరెట్టు పెట్టె తీసి లైటర్ తో ఓ సిగరెట్టు ముట్టించి నున్నగా వున్న గుండును ఓసారి చేత్తో తడుముకున్నాడు.

అతనలా గుండును చేత్తో తడుముకోవటం చూస్తే లీలాకు నవ్వొచ్చింది. కాని నవ్వలేదు జాన్సన్ కు కోపం వస్తుందని.

కాని—లీల ఆ విషయం గురించి అనంత్ తో చెబుతూ నవ్వింది. ఆమె నవ్వటాన్ని గమనించి లీలను గుర్రుగా చూశాడు జాన్సన్.

"ఎంతసేపు ఇలా కూర్చోటం? నాకు నడుమునొప్పిగా వుంది. పడుకోవాలి" అన్న దిలీల.

"తెల్లవార్లూ కూర్చోక తప్పదు లీలా. మనం మన ఇంట్లో బెడ్ రూములో లేము. క్రూరమృగాలు నిండివున్న

నికోలాయ్ దీవుల్లో వున్నాం" అన్నాడు అనంత్ నవ్వుతూ.

చిన్నగా జాన్సన్—రంజిత్‌తో అన్నాడు.

"మందుసీసాలు తీసుకువచ్చారు కదా....వాటిని బయటకు తియ్యండి."

"అవి మనకు కాదు సాబూజా దీవిలో వున్న మనుషులకు."

"ముందు మనకు. మిగిలినవే వాళ్ళకు. మందు కొట్టకుండా ఒక్కరాత్రి కూడా ఇంతవరకు వుండలేదు. చీకటి పడగానే మందు కొట్టకపోతే నాకు మతిపోయినట్లు వుంటుందని నీకు తెలుసుకదా."

"తెలుసు. కాని భారత్‌ను అడగాలి" అని ఆ విషయాన్ని భారత్‌తో చెప్పాడు. పక్కనే పైల్లా కూడా వుంది.

వాళ్ళంతా మళ్ళీ కిందికి దిగి హెలికాప్టర్ పక్కనే నిలబడి వున్నారు.

"వద్దు. నాకు ఇష్టంలేదు. ఎందుకంటే మనమంతా తాగి మత్తులో జోగుతున్నప్పుడు ఎర్రతోడేళ్ళు వచ్చి మనమీద పడే అవకాశం వుంది" అన్నాడు భారత్.

అనంత్ కూడా అతని మాటలకు సపోర్టు చేశాడు.

కాని జాన్సన్ ఒప్పుకోలేదు.

"మీ అందరినీ తాగమని నేను బలవంత పెట్టడంలేదు. నేనొక్కడినే తాగుతాను. ఎంత యెక్కువగా తాగినా నేను కంట్రోల్‌లోనే వుంటాను. తాగకపోతే నా బుర్ర పనిచేయారు" అన్నాడు పట్టు వదలకుండా—

భారత్ రంజిత్‌ను చూశాడు.

రంజిత్ చిన్నగా "జాన్సన్ చెప్పిన మాట నిజమే. తాగకపోతే అతని బుర్ర పనిచేయదు. మనిషి చురుకుగా వుండలేడు. మనం ఈ రాత్రి ఎర్రతో దేళ్ళ దాడిగురించి భయపడుతున్నాం. అలాంటప్పుడు వాటిని యెదిరించాలంటే మనకు జాన్సన్ చురుగ్గా వుండటం యెంతో ముఖ్యం. అందుకోసమైనా మనం అతనికి ఓ బాటిల్ ఇవ్వక తప్పదు" అని చెప్పాడు.

ఆపైన భారత్ మాట్లాడలేదు. స్టెల్లాకు కళ్ళతోనే సైగచేశాడు.

కాబిన్‌లో చిన్న లైటు వెలుగుతోంది.

స్టెల్లా ఓ విస్కీ బాటిల్ తీసుకొచ్చి జాన్సన్‌కు ఇచ్చింది.

థాంక్స్ చెప్పాడతను.

వెంటనే పళ్ళతోనే దాని కార్క్ వూడదీసి సీసా యెత్తి రెండు గుటకలు వేశాడు.

లీల అతడికేసి చిత్రంగా చూసింది.

అలాంటి మనుషులను ఆమె ఇంతకుముందు యెప్పుడూ చూడలేదు. కేవలం సినిమాల్లోనే చూసింది. అంత మొరటుగా ప్రవర్తిస్తున్న మనిషిని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తోంది.

పొద్దు గడిచిపోతోంది.

మళ్ళీ దీవుల గురించి, సముద్రపు ప్రయాణాల గురించి కొంతసేపు వాళ్ళందరికీ చెప్పాడు అనంత్.

అంతాలోపలే కూర్చున్నారు-కాని జాన్సన్—రంజిత్ అక్కడికి కొంచెం దూరంలో వున్న కొంచెం యెత్తుగా వున్న బండరాయిమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

రంజిత్‌కు కూడా తాగాలని వుంది. కాని భారత్‌తో ఆ విషయం చెప్పటానికి సందేహించాడు. అందుకే ఆ విషయాన్ని జాన్సన్‌కు తెలియజేశాడు. జాన్సన్ సగం బాటిలును ఖాళీ చేసి మిగిలిందాన్ని రంజిత్‌కు ఇచ్చాడు. అంతా కబుర్లలో మునిగిపోయారని అనుకున్న తర్వాత ఆ సగం బాటిలును రంజిత్ ఖాళీ చేశాడు.

"లోపలకు రండి" అని పిల్చారు భారత్—అనంత్ బయట కూర్చున్న ఇద్దరినీ.

"నేను ఇక్కడే కూర్చుంటాను" అన్నాడు జాన్సన్ సిగరెట్టు వెలిగించుకోబోతూ—

"వద్దు. ప్రమాదం. ఏ జంతువైనా వచ్చి హటాత్తుగా మీదకు దూకవచ్చు" అన్నాడు భారత్.

రంజిత్ లేచి నిల్చుని "నువ్వు కూర్చో, నాకు నిద్ర వస్తోంది" అంటూ లోపలకు వచ్చాడు.

"జాన్సన్....నువ్వు కూడా వచ్చెయ్యి."

"నేను ఇక్కడే కూర్చుంటాను. నాకు భయం లేదు. నా దగ్గర రివాల్వర్ వుంది."

"రివాల్వర్ ఒక్కటే చాలదు. ఇదిగో ఈ తుపాకి కూడా తీసుకు వెళ్ళు."

భారీ శరీరాన్ని కదుల్చుకుంటూ వచ్చాడు జాన్సన్. భారత్ అందించిన తుపాకిని, టార్చిలైటును తీసుకుని వెళ్ళి మళ్ళీ ఆ బండమీద కూర్చున్నాడు.

"మేమంతా లోపల కూర్చుంటాం. నువ్వొక్కడివే నిద్రపోకుండా కూర్చోగలవా?" అనంత్ అడిగాడు.

"ఒంటిగంట వరకు నేను మెలకువతో వుంటాను. ఆ తర్వాత యెవరైనా కాపలాగా వుండండి."

"తర్వాత యెవరు వుంటారు?" అడిగాడు అనంత్.

ఎవ్వరూ మాట్లాడలేదు.

"నాకు ఎవరైనా మరో మనిషి తోడుగా వుంటే నేను వుంటాను" అన్నాడు రంజిత్.

భారత్ నవ్వి "ఒక్కడివే వుండటానికి భయమా?" అన్నాడు.

"కాదు. ఎవరైనా తోడుగా వుండి మాట్లాడుతుంటే నిద్ర రాకుండా వుంటుంది. అంతేకాని భయంకాదు."

"ఎవ్వరూ వుండనవసరం లేదు. ఒంటి గంటనించి నాలుగు గంటల వరకు నేను మెలకువగా వుంటాను" అన్నది సెల్లా.

"థాంక్ యూ" అన్నాడు అనంత్.

"నేను మెలకువగా వుంటానని చెప్పలేదు కాని నాకు కొత్త ప్రదేశంలో అంత తొందరగా నిద్రపట్టదు. నిద్ర పట్టినా కొంచెం సేపట్లోనే మెలకువ వస్తుంది" అన్నాడు అనంత్.

అప్పటికే లీల కళ్ళు మూతలుపడుతున్నాయి. పైలట్ అందరినీ చూస్తున్నాడు ఏదో సినిమా చూస్తున్నట్టు.

ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా దీవుల్లోకి వెళ్ళలేదు.

సెల్లా సిగరెట్ వెలిగించింది.

ఆమె భారత్‌తో ఏకాంతాన్ని కోరుకుంటోంది. కాని అక్కడ అలాంటి అవకాశమే లేదు. ఆమె పక్కనే లీల కూర్చుంది. ఆమె పక్కనే అనంత్ కూర్చుని వున్నాడు.

లీల వెనక్కి వాలి కనుకు తీయబోతోంది. మిగిలిన వారంతా మెలకువగా వున్నారు.

"సో....ఇక మనం విశ్రాంతి తీసుకుందాం. ఎంత

నిద్రలో వున్నా చీమ చిటుక్కుమన్నా మెలకువ వచ్చేలా వుండండి. ఎర్రతో దేళ్ళ దాడి గురించి మరచిపోకండి.... బయట జాన్సన్ ఒక్కడే వున్నాడు" అని—

"మిస్టర్ జాన్సన్....ఏమాత్రం ప్రమాదాన్ని పసిగట్టినా నువ్వు పెద్దగా కేకలు పెట్టు. వెంటనే మేము మేలుకుంటాం" అంటూ డోర్‌ను క్లోజ్ చెయ్యటానికి ముందుకు వంగి చిన్నగా అరిచాడు భారత్.

లీల వులిక్కిపడి కళ్ళు తెరిచింది ఆ అరుపుకు. అంతా డోర్ వైపు చూశారు.

హెలికాప్టర్ కేబిన్ పైనించి డోర్ మీదకు పొడుగ్గా వేడల్పుగా వున్న నల్లని పాము వేల్లాడుతోంది. అది బాగా నల్లగా వుంది. దాని పొట్టకింద తెల్లగా గీసినట్టున్న చారలు వున్నాయి. అది వుండుండి నోరు తెరుస్తోంది. అటూ ఇటూ వూగుతోంది.

దాన్ని చూడ్డంతోనే భయంతో అరవబోయింది లీల. వెంటనే అరచేత్తో ఆమె నోరు మూసేసింది స్టెల్లా.

"ఉష్, అరవకు. ఆ పాము మనమీదకు దూకుతుంది ఆ శబ్దానికి. దాన్ని నేను చంపుతాను" అని చేతిని తీసేసింది.

దాన్ని చూస్తూనే జాన్సన్ తుపాకితో బండమీద నించి అక్కడకు రాబోయాడు.

"జాన్సన్....నువ్వక్కడే వుండు. పక్కకు తప్పుకో" అన్నది స్టెల్లా రివాల్వర్ బయటకుతీసి పాము తలకు గురి పెడుతూ—

జాన్సన్ నవ్వాడు పరిహాసంగా.

"ఇప్పుడు తెలుస్తుంది నీ గురి యేమిటో? నేను ఎర్రతో దేలును గురిచూసి కాల్చలేకపోయానని ఏదో కోతలు

కోకావు కదా" అనుకున్నాడు మనసులోనే.

అతడి నవ్వులోని పరిహాసాన్ని అర్థంచేసుకుని లోపలే చిన్నగా నవ్వుకుంది స్టెల్లా.

పాము మెల్లగా మరింత కిందకు జారుతోంది. ఇంకా యెంత పొడుగు వున్నదో తెలీదు.

"ఢాం"

పాము తల చితికి హెలికాప్టర్‌కు కొంచెం దూరంలో ఎగిరి పడింది గిలగిలా తన్నుకుంటూ.

లోపల్నించే ఆత్రంగా అంతా దాన్ని చూశారు. ఆ పాము తల పూర్తిగా చితికిపోయి మొండెం మాత్రమే మిగిలి వుంది.

జాన్సన్ షాకైపోయాడు. ఆడదైన స్టెల్లా కదులుతున్న పాముతలను అలా మాటిగా చితికిపోయేలా షూట్ చెయ్యగలదని అతడనుకోలేదు.

ఆమె గురి తప్పదని అతడికి అర్థమయ్యింది.

డోర్ క్లోజ్ చేశాడు భారత్.

తుపాకి మొనతో ఎత్తి ఆ పామును దూరంగా చెట్లలోకి విసిరేశాడు జాన్సన్.

"భయపడకు....దీవుల్లో వుండేవి ఇవే ...నిద్రపో.... జాన్సన్ కాపలా వున్నాడు" అన్నాడు అనంత్—లీల భుజంమీద అనునయంగా రాస్తూ—

ఆమె అతడిని భయంతో అంటుకుపోయింది.

* * *

జాన్సన్ సిగరెట్టు కాలుస్తున్నాడు.

చెట్లు చీకట్లో దయ్యాల్లా తలలు వూపుతున్నాయి.

చెట్లకొమ్మలు ఒకదానికొకటి రాచుకుంటూ భయం

కలిగించే ధ్వనిని చేస్తున్నాయి.

భారత్ కళ్ళముందు ఎర్రటి కాంతులను విరజిమ్ము తున్న అపురూపమణి కనపడుతోంది. అతడిని ఆహ్వానిస్తు న్నట్టుగా వుంది.

హెలికాప్టర్ చెడిపోయినప్పుడు భయపడ్డాడు కాని ఇప్పుడు భయంలేదు. తప్పకుండా విజయం తనదే. టకారా దీవిని తెలుసుకోవటం అంత కష్టం కాకపోవచ్చు.

ఆ దీవి గురించి తెలిసిన మనుషులు సాబూజా దీవిలో వున్నారని ప్రొఫెసర్ అనంత్ చెప్పాడు. అక్కడినించి హెలికాప్టర్‌లో సముద్రంమీద బయల్దేరితే టకారాదీవి కనపడకుండా వుండదు. ఒకసారి ఆ దీవిని చూశాడు కాబట్టి తను దాన్ని సులభంగానే గుర్తుపడతాడు.

ఇక ఆ దీవిలో పాదం మోపిన తర్వాత చీకటిపడగానే కపాచీదేవత విగ్రహం దగ్గరకు వెళ్ళి ఆ మణిని చేజిక్కించుకోవాలి.

అప్పుడే తన ధ్యేయం నెరవేరేది.

ఇలా అతను కళ్ళు మూసుకునే ఆలోచిస్తున్నాడు.

పైలట్‌కు కునుకుపట్టింది.

ప్రొఫెసర్ అనంత్ మనసులో ఎలాంటి ఆలోచనలూ లేవు కాబట్టి అప్పుడే నిద్రలోకి జారిపోయాడు.

లీలకూడా నిద్రపోతూంది.

కళ్ళు తెరిచాడు భారత్. తలతిప్పి లీలను చూశాడు. గాలి పీలుస్తున్నప్పుడు వదులుతున్నప్పుడు ఆమె గుండెలు యెగిరిపడుతున్నాయి.

సెలా ఆలోచనలతోనే నిద్రపోయింది.

కొంచెంసేపటి తర్వాత భారత్ కూడా నిద్రపోయాడు.

జాన్సన్ ఒక్కడే ఆ మనుషులందరిలోనూ మెలకువగా వున్నాడు.

అతనికూడా మత్తుగా వుంది. నిద్ర వస్తున్నట్టుగా అనిపించింది. అంతమంది నిద్రమత్తులో జోగుతున్నప్పుడు అతనొక్కడే మెలకువగా వుండటం కష్టమనిపించింది.

అందుకే అతను హిందీపాటలు పాడటం మొదలు పెట్టాడు. ఒకదాని తర్వాత ఒకటి వరసగా పాడుతున్నాడు చిన్నగా.

కొంచెంసేపు పాడిన తర్వాత అతనికి నిద్రమత్తు ఎగిరిపోయింది. ఒకసారి బండమీద లేచి నిల్చుని చుట్టూ చూశాడు. ఎక్కడా ఏమీ అనుమానించవలసినదిగా అనిపించలేదు.

అతని చేతిలో రివాల్వర్ వుంది. మరో చేతిలో టార్చిలైటు వుంది. టార్చి వెలుతురును చెట్లమీదికి ఫోకస్ చేశాడు.

నల్లటి పండ్లగుత్తులు కనపడ్డాయి. ఆ పండ్లు తాటిపండ్లలా వున్నాయి. అంతకంటే చిన్నవిగా వున్నాయి.

జాన్సన్ మళ్ళీ కూర్చున్నాడు.

కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

పొగ వదులుతూ ఆకాశంలోకి చూశాడు. నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి.

గాలి మరీ వేగంగా వీచటంలేదు. నెమ్మదిగా వీస్తోంది. చెట్లు కూడా బద్ధకంగా కదులుతున్నాయి.

ఏదో ఆలోచిస్తూ సిగరెట్టు పొగ లాగుతున్న అతనికి చెట్లలో ఏదో కదులుతున్నట్టుగా కనిపించింది. వెంటనే టార్చిలైటును ఆ వైపుకు ఫోకస్ చేశాడు. అక్కడ అత

నికి ఏమీ కనిపించలేదు. ఇంకొంచెం పరీక్షగా చూసిన తర్వాత తెల్లటి కుందేళ్ళు రెండూ ఒకదానిమీద ఒకటి పడుతూ ఆడుకుంటూ కనిపించాయి.

టార్చిని ఆపేశాడు.

మరోసారి ఐనట్లయితే జాన్సన్ ఆ కుందేళ్ళను పట్టుకునే వరకు వూరుకునేవాడు కాదు. కుందేలు మాంసం అంటే అతనికి బాగా ఇష్టం. కాని అప్పుడు వాటిని వదిలేశాడు.

వింజామర వీస్తున్నట్టుగా వీస్తున్న గాలికి అతడికి క్రమంగా నిద్ర ముంచుకువచ్చింది. చిన్నగా కళ్ళు మూతలు పడ్డాయి. కూర్చుని—కూర్చుని నడుము నొప్పిగా వున్నట్లు అనిపించింది.

కేబిన్ కేసి చూశాడు. అంతా గాఢనిద్రలో వున్నారు. తనుకూడా ఓ గంటసేపు నిద్రపోతే? అంతా నిద్రపోతున్నారు కాబట్టి తను నిద్రపోయిన సంగతి యెవ్వరికీ తెలీదు.

జాన్సన్‌కు అప్పుడు ఎర్రతోడేళ్ళ గురించి గుర్తుకు వచ్చింది.

నవ్వుకున్నాడు.

ఇంతమంది మనుషులను చూసి అవి భయపడివుంటాయి. అందువల్లనే ఇంతవరకు రాలేదు. లేకపోతే ఎప్పుడో వచ్చేవి. కాబట్టి ఇక ఆ ఎర్రతోడేళ్ళు రావు. వాటి గురించి ఆలోచిస్తూ తను నిద్రపోకుండా కూర్చోవటం వేస్ట్.

జాన్సన్ ఇలా అనుకుని, రివాల్వర్‌ని, తుపాకిని టార్చిలైటును పక్కనే వుంచుకుని బండమీద వెనక్కివాలాడు. తలకింద చేతులు వుంచుకుని కళ్ళు మూసు

కున్నాడు.

అలా మూసుకున్న పదినిముషాలు గడవకముందే నిద్ర లోకి జారిపోయాడు. కొంచెం సేపట్లోనే అతను గురక పెట్టడం మొదలుపెట్టాడు.

* * *

నిశ్శబ్దంగా వున్న ఆ ప్రదేశంలో ఎక్కడో గడ్డిమీద బరబరా లాగుతున్న చప్పుడు వుండుండి వినపడుతోంది.

రాను రాను ఆ శబ్దం మరింత దగ్గరయ్యింది.

ఆ బరబర శబ్దానికి సంబంధించిన ప్రాణి కొంచెం సేపటి తర్వాత వెల్లికిలా పడుకుని గుర్రుపెడుతున్న జాన్సన్ దగ్గరకు వచ్చింది.

వచ్చి—ఒకసారి అతడిని ఆప్యాయంగా వళ్ళంతా తడిమింది. అలా తడుముతున్నప్పుడు జాన్సన్ కనీసం ఒక సారి కదలనుకూడా లేదు. విస్కీ మత్తు అతడిని కదలనివ్వ లేదు.

అందువల్ల ఆ ప్రాణి చిన్నగా జాన్సన్‌ను చుట్టుకు పోవటం మొదలుపెట్టింది.

ఐనా జాన్సన్ గురక ఆపలేదు. అతడి గుర్రుతోనే స్టెల్లాకు మెలకువ వచ్చింది.

కళ్ళు తెరిచింది స్టెల్లా. వాచీకేసి చూసుకుంది. పన్నెండు గంటలు దాటి ఇరవై నిముషాలయ్యింది. కేబిన్ లో అంతా మంచి నిద్రలో వున్నారు. ఒహుశ అంతా ఎర్రతోదేళ్ళ గురించి మరచిపోయారేమో అనుకుంది.

ఎర్ర తోదేళ్ళ గురించి గుర్తుకు రాగానే ఆమెకు బయట బండమీద కాపలాగా కూర్చున్న జాన్సన్ గుర్తుకు వచ్చాడు. ముందుకువంగి బయటకు చూసింది.

(సశేషం)